క్లుప్తంగా

ఎంఈవో–2గా చందుకుమార్



రాజమహేంద్రవరం రూరల్: మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో)–2గా బి.కిరణ్ చందుకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తొర్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో డి.శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

కడియం మండలానికి..

కడియం: మండల విద్యాశాఖాధికారి – 2గా వై.నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఆలమూరు మండలం చెముడులంక జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై మండలానికి వచ్చారు. ఎంఈవో–1గా వి.లజపతిరాయ్ బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌డెస్క్



హెల్ప్‌డెస్క్‌లో రైలు రాకపోకల వివరాలు తెలుసుకుంటున్న ప్రయాణికులు

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే ప్రయాణికులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో ఉన్నతాధికారుల ఆదేశాలతో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. వేసవి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి సహాయం అందించేందుకు, రైళ్ల సమాచారం ఎప్పటికప్పుడు తెలిపేందుకు ఇది ఉపయోగపడుతుంది. ప్రయాణికులు ఈ సేవలను వినియోగించుకోవాలని రైల్వేస్టేషన్ చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ సుంకర చంద్రమౌళి తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ దిగువ నీటిలో ఆదివారం గల్లంతైన కలగా దుర్గాప్రసాద్ (19) మృతదేహం లభించింది. మృతుడు స్నానానికి దిగినచోటనే మృతదేహాన్ని వెలికితీశారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. సీఐ కె.మంగాదేవి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రేపు చదరంగం పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో బుధవారం అండర్ 7 బాల, బాలికాల విభాగంలో చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు. స్థానిక అల్యూమినియం అసోసియేషన్ హాల్లోనిర్వహించే ఈ పోటీలకు 2016 జనవరి 1 తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలవారు పుట్టిన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

మున్సిపల్ స్కూళ్ల ఆయాల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో పార్ట్‌టైం కంటింజెంట్ వర్కర్లుగా పనిచేస్తున్న 66 మందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తమను మున్సిపల్ శాఖ నుంచి స్కూల్ ఎడ్యుకేషన్‌కు బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇప్పటివరకూ వేతనాలు ఇచ్చిన మున్సిపల్ కార్పొరేషన్.. ఏప్రిల్ నుంచి నిలుపుదల చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

రాజమహేంద్రవరం సిటీ: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 1902కి వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి, త్వరితగతిన పరిష్కరించాలని అదనపు డిప్యూటీ కమిషనర్ సత్యవేణి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 21 మంది వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు. సత్యవేణి మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యం సమస్యలకు చెందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రేపు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం డిపో పరిధిలో నడుస్తున్న సర్వీసులు, లాజిస్టిక్స్ (కార్గో) పార్సిల్ సౌకర్యాలను తెలుసుకునేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఆరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య 99592 25535కు ఫోన్ చేయవచ్చన్నారు. డిపో అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

వ్యక్తి అదృశ్యం

కంబాలచెరువు: పీఅండ్‌టీ కాలనీకి చెందిన జె.శ్రీనివాసాచార్యులు అదృశ్యమైన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. బంగారం పని చేసే తన భర్త గత నెల 10వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ అతడి భార్య విజయ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

లాలాచెరువులో అభివృద్ధి పరుగు

- సీఎం జగన్ పాలనలో మహర్దశ
- వసతుల కల్పనపై ఎమ్మెల్యే రాజా ప్రత్యేక దృష్టి



లాలాచెరువు పంచాయతీలో నిర్మించిన సీసీ డ్రైనేజీ



అభివృద్ధి చేసిన రహదారి

రాజమహేంద్రవరం సిటీ: మహానగరంగా మారుతున్న రాజమహేంద్రవరంలో తాజాగా చేరిన లాలాచెరువు పంచాయతీలో రూ.కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మరిన్ని పనులకు చేపట్టేందుకు కూడా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. లాలాచెరువు పంచాయతీ భౌగోళికంగా నగరంలో కలిసి ఉన్నప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయింది. నగర పాలక సంస్థకు ఆనుకుని ఉన్నప్పటికీ రాజానగరం నియోజక వర్గంలో కలసి ఉండటం, పంచాయతీ ప్రాతిపదికగా నిలిచిపోవడంతో కనీసం డ్రైనేజీల నిర్మాణానికి నోచుకోలేకపోయింది.

అభివృద్ధికి చిరునామా

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోనికి రావడంతో లాలాచెరువు పంచాయతీలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సారథ్యంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. గత టీడీపీ పదేళ్ల పాలనలో రూ.67.79 లక్షలతో పనులు చేపడితే, వైఎస్సార్ సీపీ పాలనలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నేతృత్వంలో కేవలం నాలుగేళ్లలో రూ.6.05 కోట్లతో అభివృద్ధి పరుగులు పెడుతోంది. గత ప్రభుత్వంలో కనీసం సీసీ డ్రెయిన్, రోడ్లు, తాగునీటి లేని దుస్థితి నెలకొంటే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మోడల్ పంచాయతీగా రూపుదిద్దుకుంటోంది.

పంచాయతీ తీరుతెన్నులు

పాలచర్ల పంచాయతీలో భాగంగా ఉన్న 23 సర్వే నంబర్లతో 260 ఎకరాల విస్తీర్ణంతో ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీ, స్పిన్నింగ్ మిల్లు కాలనీ కలసి లాలాచెరువు పంచాయతీగా 1994లో ఆవిర్భవించింది. ప్రస్తుతం ఈ పంచాయతీలో 2,500 గృహాలు, సుమారు 12,000 మంది జనాభా ఉన్నారు. ఎక్కువగా ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలు జీవిస్తున్నారు. ఈ పంచాయతీ కేవలం ఇంటిపన్నులతో మాత్రమే పాలన సాగిస్తూ వచ్చింది. టీడీపీ పదేళ్ల పాలనలో కనీస మౌలిక వసతులు కల్పించలేదు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో..

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేపట్టిన నాలుగేళ్లలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సారథ్యంలో రూ.కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సచివాలయ భవనాలు, రైతుబజారు, హెల్త్ క్లినిక్‌లు, గ్రామ మహిళా సమాఖ్య భవనం, నాడు – నేడులో పాఠశాల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులు రూ.40 లక్షలతో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జక్కంపూడి రామ్మోహనరావు మెమోరియల్ పార్కు నిర్మాణం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం లాలాచెరువు పంచాయతీని నగరపాలకసంస్థలో విలీనం చేస్తూ జారీ చేసింది. 2022 మే 21 ఉత్తర్వులు అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ వెలువడంతో లాలాచెరువు పంచాయతీ రాజమహేంద్రవరం నగరపాలకసంస్థలో విలీనమైంది. నగరపాలకసంస్థ అధికారులు తక్షణమే 14వ వేతన సంఘం నిధులు, జనరల్ నిధులు రూ.5.06 కోట్లతో సీసీ డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం చేపట్టింది.

వసతుల కల్పనపై దృష్టి



లాలాచెరువు పంచాయతీలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాం. రూ.24.60 కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాం. స్పిన్నింగ్‌మిల్లు, హౌసింగ్ బోర్డు కాలనీలలో 46 కిలో మీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా 9 కిలోమీటర్లు పూర్తయ్యాయి. రూ.8.60 కోట్లతో మిగిలిన సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయగా, మంజూరుకు సిద్ధమయ్యాయి. ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.16 కోట్లతో గోదావరి నీరు అందించేందుకు ప్రతిపాదనలు చేశాం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

– జక్కంపూడి రాజా, రాజానగరం ఎమ్మెల్యే

ఎమ్మెల్యే రాజా కృషి



లాలాచెరువు పంచాయతీలో ఈ నాలుగేళ్లుగా అభివృద్ధి పరుగులు పెడుతోంది. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోంది. ఆయన ప్రత్యేక దృష్టి సారించి పెద్దమొత్తంలో నిధులు తీసుకువచ్చారు. ఇక్కడి ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నారు. గత టీడీపీ పాలనలో ఈ ప్రాంతాన్ని విస్మరించారు.

– కదలి సీతారత్నం, మాజీ సర్పంచ్ లాలాచెరువు

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

31 గ్రాముల బంగారం, రూ.70 వేలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మంగాదేవి, చిత్రంలో నిందితుడు (ముసుగు వ్యక్తి)

ధవళేశ్వరం: గ్రామంలోని వాడపేటలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని ధవళేశ్వరం పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 31.67 గ్రాముల బంగారం, రూ.70 వేలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం సీఐ కె.మంగాదేవి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈనెల 13వతేదీన వాడపేటకు చెందిన మైలపల్లి రామకృష్ణ పోలేరమ్మ జాతరకు వెళ్లారు. ఇంటికి వచ్చి చూసేసరికి బీరువాలో ఉండాల్సిన నగదు, బంగారం మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడైన ధవళేశ్వరం జాలరిపేటకు చెందిన సీకోటి కామేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ మంగాదేవి, హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాసులు, ఎస్.చంద్రశేఖర్, కానిస్టేబుల్ టి.వెంకటేశ్వరరావును ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి, సౌత్‌జోన్ ఎస్పీ కె.శ్రీనివాసులు అభినందించారు.

కేంద్ర కారాగారంలో వసతుల పరిశీలన



కేంద్రకారాగారంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి సోమవారం కేంద్ర కారాగారాన్ని సందర్శించి, అక్కడి వసతులను పరిశీలించారు. కారాగారంలోని పారా లీగల్ వలంటీర్లతో మాట్లాడారు. ఎప్పటికప్పుడు ఖైదీల సమస్యలను, ఫిర్యాదులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. ఖైదీలతో మాట్లాడి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందిస్తున్న న్యాయ సేవలను వారికి వివరించారు. ప్రత్యేకంగా డిఫెన్స్ తరఫున వాదించేందుకు, ముద్దాయిలకు, ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందించేందుకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ఏర్పాటు చేశారన్నారు. అందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కారాగారంలోనూ, కేసు విషయంలోనూ ఖైదీల కుటుంబ సభ్యులకు న్యాయ సంబంధిత సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలని కోరారు.

డాక్టర్ ప్రియాంకకు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకున్న డాక్టర్ ప్రియాంక

రాజమహేంద్రవరం సిటీ: జూనియర్ చాంబర్ ఇంటర్‌నేషనల్ సంస్థ ట్రైనింగ్ విభాగానికి సంబంధించి జేసీఐ రాజమహేంద్రవరం గోదావరి పూర్వపు అధ్యక్షురాలు, జోన్ ఆఫీసర్, శ్రీలత హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ అనసూరి ప్రియాంక ఉత్తమ ప్రతిభాశాలి (ఔట్ స్టాండింగ్ పార్టిసిపెంట్) అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఈనెల 15, 16, 17, 18 తేదీల్లో జేసీఐ జోన్ 4, జోన్ 12 (ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ, కర్ణాటక సగభాగం)లకు ట్రైనర్ శిక్షణ జరిగింది. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డాక్టర్ అనుసూరి ప్రియాంక ఈ పురస్కారం అందుకున్నారు. కాగా.. అవార్డు అందుకున్న డాక్టర్ ప్రియాంకను పలువురు అభినందించారు.

రైల్వే ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం



సమీక్ష నిర్వహిస్తున్న రైల్వే డీఐజీ సదన్‌జబ్ ఖాన్

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే ప్రయాణీకుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు రైల్వే డీఐజీ సదన్‌జబ్ ఖాన్ అన్నారు. సురక్ష సమ్మేళన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాజమహేంద్రవరంలో ఆర్‌పీఎఫ్ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నిఘావ్యవస్థ పెంచి దొంగతనాలు జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఏవిధమైన ఇబ్బందులు తలెత్తినా 139కు కాల్ చేయాలనే విషయంపై ప్రయాణికులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. భద్రతా పరమైన విషయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయడం ద్వారా ఏవిధమైన ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించాలన్నారు.

23 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం

- వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- ఉత్సాహంగా గడపగడపకూ



శాటిలైట్‌సిటీ సచివాలయం –3 పరిధిలో మహిళలకు అభివాదం చేస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారని, ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వలంటీర్, సంబంధిత అధికారి వెళ్లి ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ , ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. శాటిలైట్ సిటీ గ్రామసచివాలయం–3 పరిధిలో సోమవారం సాయంత్రం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చందన నాగేశ్వర్, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ నాయకులు కలిసి బిబ్లాకులోని పాతపేట తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి నాలుగేళ్ల పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ లబ్ధిని తెలుపుతూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డ్రైనేజీలు, ఇళ్లస్థలాలు, తాగునీటి సమస్యలను స్థానికులు తెలపగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ప్రతి ఒక్కరికీ పథకాలు

చందన నాగేశ్వర్ మాట్లాడుతూ జగన్ పాలనలో పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఆదాయ, కుల, జనన, మరణ పత్రాలు, ఆధార్‌కార్డు మార్పులతో పింఛన్లు రాకపోవడం వంటి కారణాలు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. వీటినన్నింటినీ పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని ఈనెల 23 నుంచి వచ్చే నెల 23 వరకూ నిర్వహించాలని ఆదేశించారన్నారు. కార్యక్రమంలో సచివాలయం–3 కన్వీనర్లు బత్తిన అప్పారావు, రుంకాని రమణమ్మ, పుచ్చా గోవింద్ రెడ్డి, సఫారి నాయుడు, బొమ్ము శ్రీను, కాకరపల్లి అప్పారావు, మీగడ గంగాధర్, దండంగి ప్రభు, దత్త సాయి, రుంకాని రవి, శివ, కుడిపూడి పద్మ, సుబ్రహ్మణ్యం, ఎం.సత్యనారాయణ, లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు, పార్టీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ పశుబీమా పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్: పాడి పశువులు, గొర్రెలు, మేకలు పెంపకందారులకు వైఎస్సార్ పశుబీమా పథకంతో ఆర్థికంగా భరోసా లభిస్తుందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆ పథకం పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెల్లరేషను కార్డు కలిగిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులందరూ 20 శాతం ప్రీమియం చెల్లిస్తే మిగిలిన 80 శాతాన్ని ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఈ బీమా సేవలు రైతులకు సత్వరం అందేలా ప్రభుత్వం ఏరియా ప్రాతిపదికన నాలుగైదు జిల్లాలకు కలిపి ఒక ఇన్సూరెన్సు కంపెనీకి బాధ్యత అప్పగించిందన్నారు. జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎస్‌టీజీ సత్య గోవింద్ మాట్లాడుతూ బీమా కోసం రైతులందరూ ఆర్బీకేలు లేదా పశు వైద్య అధికారిని సంప్రదించాలన్నారు. వివరాలకు 1962 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

రాజమహేంద్రవరం సిటీ: బంగారుకొండ కార్యక్రమం ద్వారా పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలని కమిషనర్ దినేష్ కుమార్ అన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బాలమిత్రలు మంగళవారం నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. ప్రతి బుధవారం పిల్లల ఎదుగుదలను పరిశీలించి, సంబంధిత యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ఇప్పటికే పౌష్టికాహార కిట్లను బాలమిత్రలకు పంపిణీ చేసామన్నారు.

పోషకాహార లోపం లేకుండా చూడాలి

కడియం: మండల పరిధిలోని చిన్నారులకు పోషకాహార లోపం లేకుండా బాలమిత్రలు కృషి చేయాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. కలెక్టర్ కె.మాధవీలత బంగారుకొండ కార్యక్రమం ద్వారా జిల్లాలోని చిన్నారులకు పౌష్టికాహార లోపం లేకుండా చర్యలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు బాలమిత్రలుగా సేవలందించేందుకు పలువురు ముందుకు వచ్చారు. వారికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అవగాహనా సమావేశం నిర్వహించారు. బంగారుకొండ కార్యక్రమం లక్ష్యాలు, అనుసరించాల్సిన ప్రణాళికను వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వి.రాధాకృష్ణ, తహసీల్దార్ ఎం.సుజాత, సీడీపీవో టి.కనకవల్లి, ఎంపీడీవో కార్యాలయం ఏవో కె.చంద్రరావు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ

కంబాలచెరువు: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ కళాశాల విద్యార్థులు ముందంజలో నిలిచారని ఆ కళాశాల డైరెక్టర్ మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.విజయ రాఘవేంద్ర 50వ ర్యాంకు, కార్తిక్ సత్యప్రసాద్‌రెడ్డి 1,569, టి.వీ ఐధర్ 1,654, జీవీ.శ్రీసత్యహిమేష్ 1,696, వి.సీ మీష 1,702, వై.మహీంద్రారెడ్డి 2,257, ఎస్.జాఫన్ 2,957, ఎల్.చంద్రశేఖర్‌రెడ్డి 3,693, యూనస్ 3,797 ర్యాంకులు సాధించారు. జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను డైరెక్టర్ మూర్తి, అకడమిక్ హెడ్స్ శ్రీకాంత్, ఆరీఫ్ హుస్సేన్ అభినందించారు.

బియ్యం, నిత్యావసరాల వితరణ

రాజమహేంద్రవరం సిటీ: కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎయిడెడ్ స్కూల్ సెక్యూరిటీ గార్డుల కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సిటీ అసెంబ్లీ ఇన్‌చార్జి బోడా వెంకట్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ద్వారానే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధ్యమవుతుందన్నారు.

ఖాళీస్థలాల్లో పార్కుల ఏర్పాటుకు ప్రణాళిక



పార్కులను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగర పరిధిలోని లేఅవుట్లలో ఉన్న ఖాళీ స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేయటానికి ప్రణాళిక రూపొందించాలని కమిషనర్ దినేష్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలో వివిధ లేఅవుట్లను ఆయన ఆయన పరిశీలించారు. వాటిలోని ఖాళీ స్థలాలను పరిరక్షించాలని, ఎవ్వరూ ఆక్రమించకుండా ప్రహరీలు నిర్మించాలన్నారు. సదరు ఖాళీ స్థలాలను అందమైన పార్కులుగా రూపొందించి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించాలన్నారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న పార్కులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలోని 49, 50 డివిజన్లలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కనకారావు, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ దేవానంద్, సహాయ ఇంజినీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బాలికపై ఆశ్రమ నిర్వాహకుడి లైంగిక దాడి

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): తల్లిదండ్రులు లేని 15 ఏళ్ల అనాథ బాలికకు ఆశ్రయం కల్పించిన నిర్వాహకుడే రెండేళ్లుగా లైంగిక దాడులకు పాల్పడుతున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి గొలనుగొండకు చెందిన బాలిక తల్లిదండ్రులు చనిపోవడంతో సమీపంలో ఉండే ఒక మహిళ ఆ బాలికను ప్రభుత్వ హాస్టల్‌లో ఉంచి చదివించేది. ఆ మహిళా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఎక్కువగా ఉండటంతో బాలికను రెండేళ్ల క్రితం విశాఖపట్నం పెన్నాడ సమీపంలోని ఒక ఆధ్యాత్మిక ఆశ్రమంలో చేర్పించింది. అక్కడ నిర్వాహకుడు బాలికతో పాటు మరో 13 మంది బాలికలతో పశువుల నిర్వాహణ పనులు చేయిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడేవాడు. ఈ క్రమంలో మరో బాలికపై లైంగిక దాడుల ఫలితంగా అనారోగ్యం పాలై తీవ్ర అస్వస్థతకు గురైందని, దీన్ని చూసిన బాలిక భయంతో ఆశ్రమం నుంచి వెళ్లిపోతానని ఏడవటంతో బాలికను కాళ్లకు గొలుసులు కట్టి పనులు చేయిస్తుండేవాడు. ఈ క్రమంలో స్నానానికి వెళ్లేందుకు గొలుసులు తీయడంతో అక్కడ పనిచేసే ఒక మహిళ సహకారంతో ఈనెల 12న బాలిక బయటకు పారిపోయి ఆటోలో రైల్వేస్టేషన్ వెళ్లి తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. రైలులో ఒంటరిగా భయంతో ఉన్న బాలికను చూసి విశాఖ నుంచి విజయవాడ వస్తున్న ఒక కుటుంబం ఆరా తీసింది. ఆ బాలికను తమతో పాటు కంకిపాడు తీసుకువెళ్లి కొన్ని రోజులు వాళ్ల ఇంట్లోనే ఉంచారు. సోమవారం కంకిపాడు పోలీసుల సహకారంతో విజయవాడలోని సీడబ్ల్యూసీ సభ్యులకు అప్పగించారు. వారు బాలికకు కౌన్సెలింగ్ నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమం పేరుతో బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులపై బాలికతో దిశ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు.

ఉద్యోగుల సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట



వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌కు కేక్ తినిపిస్తున్న నిఖిల్ కృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సీపీఎస్ రద్దు చేసి జీపీఎస్‌ను ఏర్పాటు చేయడం, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసినందుకుగాను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఉద్యోగులందరి తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నానని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. సోమవారం ఆయనను ఏపీ గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. నాగేశ్వర్ మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకు రావాలని, ఎల్లవేళలా ఉద్యోగులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, రాష్ట్ర సచివాలయం ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్ కృష్ణ, పెయ్యాల రాజేష్, గ్రామ వార్డు సచివాలయాల సంఘ జిల్లా అధ్యక్షుడు దాసర రవితేజ, జనరల్ సెక్రటరీ కాశీవిశ్వనాథ్, రాజేంద్ర సక్సేనా, అశోక్ , చిన్నబాబు, రామాంజనేయులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి



ఎంపీడీవో శ్రీనివాసరావుకు మొక్క అందజేస్తున్న విప్పర్తి నిఖిల్ కృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో గృహ నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని ఎంపీడీవో డి.శ్రీనివాసరావు సూచించారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్ కృష్ణ, సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సచివాలయ ఉద్యోగులు పాత్ర కీలకమన్నారు. జిల్లా అధ్యక్షుడు దాసరి రవితేజ, ఉపాధ్యక్షుడు గుబ్బల శామంత్ సక్సేనా, మండల అధ్యక్షుడు బందెల అశోక్ కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కర్రి శేఖర్‌బాబు, మండల జనరల్ సెక్రటరీ పెనుగుల చినబాబు, ఉపాధ్యక్షుడు తన్నీరు రామాంజనేయులు పాల్గొన్నారు.